# పక్కాగా ఇ-పాస్ అమలు

## ◆ ఎలాంటి అనుమానాలకు తావులేదు ◆ డీలర్లతో మంత్రి పరిటాల సునీత




ఇ-పాస్ యంత్రంలో బొటను వేలిముద్ర సరిచూసుకుంటున్న మంత్రి పరిటాల సునీత

**జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే :** పేదలకు పక్కాగా నిత్యావసర సరుకులు అందించడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం. ఇందుకోసమే ఈ-పాస్ యంత్రాలు ప్రవేశపెడుతున్నాం. ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమానాలు వద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. ఇ-పాస్ యంత్రాల పనితీరుపై గురువారం సాయంత్రం రెవెన్యూభవన్‌లో సంయుక్త కలెక్టర్ లక్ష్మీకాంతం అధ్యక్షతన డీలర్లకు అవగాహన-శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మంత్రి సునీత మాట్లాడుతూ తొలిసారిగా డీలర్లతో సమావేశమైయ్యా. తొలిసారిగా ఇ-పాస్ యంత్రాలు, ఎలక్ట్రానిక్ యంత్రానికి అనుసంధానంతో కొత్త విధానాన్ని తీసుకొచ్చాం. ఇ-పాస్ యంత్రాలు ప్రవేశపెడితే ఏం లాభమో ఉన్నతాధికారుల నుంచి తెలుసుకున్నా. దీనిపై ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం తూర్పుగోదావరి జిల్లాలో ప్రయోగత్మాకంగా ప్రవేశపెట్టగా, అక్కడ సత్ఫలితాలు వచ్చాయి. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఇ-పాస్ యంత్రాలు అమలుచేయాలని నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో మొత్తం 29 వేల ఇ-పాస్ యంత్రాలు అవసరం ఉండగా, తొలి విడతలో రాష్ట్రంలో 6వేల మిషన్లు పంపిణీ చేయగా, అందులో 504 యంత్రాలు అనంతపురానికే కేటాయించామని మంత్రి చెప్పారు. అవి కూడా 400-500 కార్డులున్న చోటే మిషన్లు ఇచ్చాం. తర్వాత మిగిలిన అన్నిచోట్ల ఇ-పాస్ యంత్రాలు అమలుకు తగుచర్యలు తీసుకుంటామన్నారు. పేదలకు అన్నంపెట్టేది డీలర్లే. మనమంతా ఒకే కుటుంబసభ్యులమని భావిస్తున్నా. డీలర్లంతా బాగా కష్టపడడం వల్లే చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ విజయవంతమైందని మంత్రి అభినందించారు. డీలర్లు అక్రమాలకు పాల్పడతారని చెప్పడం లేదు. మనలో ఒక్కరు తప్పు చేసినా అందరం చేసినట్టే. ఏమైనా సమస్యలుంటే చెప్పండి. ఇ-పాస్ యంత్రాలు అమలుచేయడంతో సమస్యలున్నాయని చిత్తూరు జిల్లాలో కూడా డీలర్లు మాదృష్టికి తెచ్చారు. మీ సమస్యలు చెప్పారు. వీటిపై ఉన్నతాధికారులతో చర్చించి మీ సమస్యలు పరిష్కరించడానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

### మార్చి నుంచి ఇ-పాస్ అమలు

ప్రజాపంపిణీ వ్యవస్థలో బోగస్‌కు తావేలేదని జేసీ లక్ష్మీకాంతం తెలిపారు. ఇందుకోసం ఇ-పాస్ అమలుకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మార్చి నుంచి అమలుచేస్తామని జేసీ తెలిపారు. గతంలో సకాలంలో డీడీలు కట్టపోతే రూ.1000 జరిమానా విధించేవారు. ఇ-పాస్ యంత్రం ద్వారా అయితే సకాలంలో డీడీలు కట్టకపోతే డీలర్‌షిప్ ఉండదన్నారు. నిత్యావసరాలను కంప్యూటరైజ్డ్ చేయడం జరుగుతుందన్నారు. వస్తువుల జిల్లాకు కేటాయింపులన్నీ పౌరసరఫరాలశాఖ ఎండీ కార్యాలయం నుంచే ఆన్‌లైన్‌లోనే వస్తాయన్నారు. అనంతరం జిల్లాలోని ఐదు డివిజన్లలో 504 మంది డీలర్లకు ఇన్‌టెగ్రా మైక్రో సిస్టిమ్ కంపెనీ ప్రతినిధులు అనీల్‌కృష్ణ, ఎన్.మోహన్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఇ-పాస్ యంత్రాల పనితీరుపై డీలర్లకు వివరించారు. డీఎస్‌ఓ సౌభాగ్యలక్ష్మీ, డీఎంయ వెంకటేశం, ఆర్డీఓలు హుస్సేన్‌సాహెబ్, నాగరాజు, ఏఎస్‌ఓ శోభారాణి, డీటీలు రామాంజినేయులరెడ్డి, ఓబ్బన్న, రామశేఖర్, తదితరులు పాల్గొన్నారు.